# మౌన ప్రదర్శన



మౌన ప్రదర్శనలో పాల్గొన్న బీసీ నేతలు

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందంటూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు శుక్రవారం నగరంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన నిర్వహించారు. కులగణన సర్వే తప్పుల తడకగా చేశారని, 7 శాతం ఉన్న అగ్రవర్ణాలు రెట్టింపు కావడం వెనుక ఆంతర్యమిమేటని ప్రశ్నించారు. 56 శాతం ఉన్న బీసీలు 46 శాతానికి పడిపోవడమేమిటని మండిపడ్డారు. ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు పెంచేందుకే ఈ కుట్రలు చేశారని, కామారెడ్డి డిక్లరేషన్‌ను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేస్తే, నమ్మకద్రోహం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, శాకపూరి భీంసేన్, రాజకిరణ్, లచ్చన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

## పార్టీ పరంగా ఇస్తామనడం సరికాదు



తలమడుగు, ఫిబ్రవరి 7 : సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పడం సరికాదు. రిజర్వేషన్లకు చట్ట బద్ధత తీసుకువస్తే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీలకు న్యాయం చేయాలి. మోసం చేయాలని చూస్తే అస్సలు ఊరుకోం.

- రాగి రాంకిషన్, బీసీ నాయకుడు, సాయిలింగి, తలమడుగు



రెబ్బెనలో బీఆర్ఎస్ నాయకురాలు పద్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఎమ్మెల్యే పరామర్శ

రెబ్బెన, ఫిబ్రవరి 7 : రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మన్యం పద్మ ఇటీవల అనారోగ్యంతో దవాఖానలో చేరి ఇంటికి రాగా, శుక్రవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆమెను పరామర్శించారు. రెబ్బెనలోని పద్మ ఇంటికి వెళ్లి ఆమెకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ అజ్మీరా బాబురావు, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బీఆర్ఎస్ నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు, దుర్గం భరద్వాజ్, జుమ్మిడి ఆనందరావు ఉన్నారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 7 : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 6137 మంది పట్టభద్రులు, 470 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితాలు అందజేస్తామన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ రోజు పాల్గొనే ఏజెంట్ల జాబితా అందజేయాలని సూచించారు. మార్చి 3న కరీంనగర్‌లో కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎన్నికల పర్యవేక్షకుడు సునీల్, డీటీ శ్యామ్‌లాల్ పాల్గొన్నారు.





పోలీస్ అధికారులతో కలిసి డీ మొబిలైజేషన్ పరేడ్‌ను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

# పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ కీలకమైనది

### రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం కీలకమైనదని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని హెడ్ క్వార్టర్‌లో పోలీస్ వాహనాల వాటర్ సర్వీసింగ్ పాయింట్‌తో పాటు డీ మొబిలైజేషన్ పరేడ్‌ను ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు., స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, అధికారులు, ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

# పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పించాలి

### కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా


దహెగాం, ఫిబ్రవరి 7 : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్నీ సిద్ధం చేయాలని తహసీల్దార్ దామెర కవితకు సూచించారు. 232 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం, 10 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆర్ఐ నాందేవ్ తదితరులు ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చి.. హ్యాండిచ్చి..

● మోసం చేస్తే ఊరుకోం



## బీసీ రిజర్వేషన్లపై మాట మార్చిన కాంగ్రెస్‌పై నాయకుల ఫైర్

### అది ముమ్మాటికీ తప్పుడు సర్వే అని మండిపాటు

### 42 శాతం అమలు చేయాల్సిందేనని డిమాండ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ''కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని హామీ ఇచ్చింది. ఇప్పుడేమో హ్యాండిస్తున్నది. అధికారంలోకి రాకముందు చెప్పిందేమిటి? ఇప్పుడు చేస్తున్నదేమిటి?' అంటూ బీసీ సంఘాల నేతలు ఫైర్ అవుతున్నారు. రిజర్వేషన్ల పేరిట తమను మోసగించిందని నిప్పులు చెరుగుతున్నారు. కులగణన నివేదిక తప్పులతడకగా రూపొందించారని, ఉద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చేసి చూపారని మండిపడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీలు పదేళ్లలో పెరగాలి కానీ, తగ్గడం ఏమిటని నిలదీస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఎక్కడా చిత్త శుద్ధిని ప్రదర్శించడం లేదని, తప్పుడు లెక్కల నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టి, తీర్మానాన్ని కేంద్రానికి పంపించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక తమ ఉనికికి ప్రమాదకరంగా మారిందని, వెంటనే దీనిని రద్దు చేసి రీ సర్వే చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

## బీసీలను మోసం చేసిన రేవంత్ రెడ్డి



తలమడుగు, ఫిబ్రవరి 7 : బీసీలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేసిండు. తప్పుల తడకగా బీసీల సర్వే నిర్వహించి 46 శాతం బీసీలు ఉన్నారని లెక్కలు చూపెట్టిండు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన ఇంటింటి సర్వేలో 51 శాతం బీసీలు ఉన్నారని అప్పటి అధికారులు రిపోర్టు ఇచ్చిండ్రు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి. అమలు చేయకుంటే ఎన్నికలను అడ్డుకుంటాం. - మంగదుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీసీ నాయకుడు, వడూర్, భీంపూర్



## బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి



తలమడుగు, ఫిబ్రవరి 7 : ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ పీసీసీ హోదాలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభను ఏర్పాటు చేశారు. బీసీ బిడ్డ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దారామయ్య చేతుల మీదుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాక ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇప్పుడు రిజర్వేషన్ల మీద గందరగోళం ఏర్పడింది. స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. మమ్మల్ని మోసం చేస్తే ఊరుకునేది లేదు. బీసీలకు అవమాన పరిస్తే బీసీ తడాఖా ఏమిటో స్థానిక ఎన్నికల్లో చూపిస్తాం.

- వినోద్, బీసీ నాయకుడు, అర్లి(కే), తలమడుగు

# 'అడ' మనుగడ కష్టమేనా..!

● కుమ్రం భీం ప్రాజెక్టు కట్టకు పగుళ్లు ● కుంగిన తారు రోడ్డు, ధ్వంసమైన సైడ్‌వాల్
● 5 టీఎంసీలకే పరిమితమైన ప్రాజెక్టు ● మరమ్మతులకు నోచుకోక ప్రమాదపుటంచున
● పట్టించుకోని సర్కారు.. స్పందించాలంటున్న రైతులు



కట్టపై తేలిన పగుళ్లపై కప్పిన పాలిథిన్ కవర్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : జిల్లాలోనే పెద్ద ప్రాజెక్టుగా పేరున్న కుమ్రం భీం ప్రాజెక్టు (అడ ప్రాజెక్ట్) ఈ ఏడాది కూడా మరమ్మతులకు నోచుకునేలా లేదు. కట్టకు పగుళ్లు ఏర్పడగా, యంత్రాంగం పాలిథిన్ కవర్లు కప్పి నెట్టుకొస్తున్నది. సర్కారు పట్టించుకోకపోవడంతో జలాశయం మనుగడకే ముప్పువాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

### ఆనకట్టకు బీటలు..

కుమ్రం భీం (అడ) ప్రాజెక్టును 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్-టీ నియోజవర్గాల్లోని 45,500 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని రోజులుగా ప్రాజెక్టు ఆనకట్టకు బీటలు పడుతున్నాయి. గత వర్షాకాలంలో కురిసిన



పగుళ్లు తేలిన బీటీ రోడ్డు

వర్షాలకు కొండలు, వాగుల నుంచి పెద్ద ఎత్తున వరద రావడంతో కట్ట బీటలు వారి బలహీనపడింది. కట్టపై వేసిన తారు రోడ్డు కుంగిపోతుండగా, సైడ్‌వాల్ కూడా వరద తాకిడికి ధ్వంసమైంది. ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చిన వరదను వచ్చినట్లే గేట్లు ఎత్తి దిగువకు వదలడంతో కట్ట తాత్కాలికంగా నిలిచి ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం వరకు నీటిని నిల్వచేస్తే కట్ట కొట్టుకుపోయే ప్రమాదముండడంతో అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు ప్రాజెక్టులో 5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ 5 టీఎంసీల్లో 2 టీఎంసీలు మిషన్ భగీరథ కోసం వినియోగిస్తున్నారు. ఇక మిగిలిన 3 టీఎంసీలు కాలువలు సరిగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో విడుదల చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా 5 వేల ఎకరాలకు కూడా సాగు నీరు అందడం లేదు.

### మరమ్మతులు చేయకపోతే కష్టమే..

కుమ్రం భీం ప్రాజెక్టు కట్టకు మరమ్మతులు చేయకపోతే నిలవడం కష్టమేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్లుగా బీటలు వారుతున్న కట్ట మట్టి కొట్టుకుపోకుండా అధికారులు ప్లాస్టిక్ కవర్లు కప్పి రక్షించే చర్యలు చేపడుతున్నారు. కానీ, కట్టకు బీటలు పెరుగుతూ క్రమంగా కుంగిపోతున్నది. ప్రాజెక్టు కట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఇందుకోసం రూ. 5 కోట్ల మేర ఖర్చవుతుందని నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించినప్పటికీ స్పందన కరువైంది. ఇకనైనా సర్కారు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ వేసవిలోనైనా కట్టకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# లొంగిపోయే మావోయిస్టులకు అండగా ఉంటాం

● కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ● అగర్‌గూడలో పర్యటన ● అనితక్క కుటుంబ సభ్యులకు సరుకులు, దుస్తుల పంపిణీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): లొంగిపోయే మావోయిస్టులకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. పోరు కన్నా.. ఊరు మిన్నా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడలో పర్యటించారు. అగర్‌గూడ నుంచి మావోయిస్టుల్లో కలిసిన అంకుబాయి అలియాస్ అనితక్క కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అంకుబాయి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వైద్యం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంకుబాయి అలియాస్ అనితక్క వనం వీడి జనంలోకి వచ్చేలా చూడాలని, లొంగిపోతే ప్రభుత్వం నుంచి ఆదుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా అజ్ఞాతంలో ఉండి, మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని, ఇకనైనా అంకుబాయి అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని చెప్పుకొచ్చారు. ఇటీవలి కాలంలో అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యారని, అదేవిధంగా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే వారిపై ఉన్న రివార్డ్‌తో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎస్పీ గ్రామస్తులతో సమావేశయ్యారు. ప్రజలు, యువత వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజం, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, పెంచికల్‌పేట్ ఎస్ఐ కొమురయ్య, ఆర్ఎస్ఐ ఓదెలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మావోయిస్టు అంకుబాయి కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

# అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 7 : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల కలెక్టర్‌కుమార్ దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఆ రోజు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

### ప్రజావాణి కార్యక్రమం రద్దు

నస్పూర్, ఫిబ్రవరి 7 : శాసన మండలి ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకూ ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఎన్నికలు ముగియగానే ఎప్పటిలాగే ప్రజావాణిని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.